
సాక్షి బాపట్ల

శనివారం । 9 । ఆగస్టు । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.10 అడుగులకు చేరింది. ఇది 312.0450 టీఎంసీలకు సమానం.



అమ్మవారికి వెండి గాజులు

దాచేపల్లి : నారాయణపురానికి చెందిన తోట వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విలువైన వెండి గాజులను స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి బహూకరించారు.

నాగదేవతగా బూర్గులమ్మ



రేపల్లె: శ్రావణ శుక్రవారం నాడు గ్రామ దేవత బూర్గులమ్మ వారిని నాగ దేవతగా అలంకరించారు. తొలుత అమ్మవారికి సుప్రభాత సేవ జరిగింది. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

మహంకాళీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతంతోపాటు విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈవో కె.సునీల్ కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై తక్షణ చర్యలు

జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశం



నరసరావుపేట రూరల్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. గత సోమవారం పీజీఆర్ఎస్‌లో ఇలా 25 ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై స్పందించిన జిల్లా ఎస్పీ తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో 19 ఫిర్యాదులను పరిష్కరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగం వారి సమస్య తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధుల వివరాలు పోలీసులు సేకరించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన భూ వరాహ స్వామి జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న భూ వరాహస్వామి జయంతి వేడుకలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో భూ వరాహస్వామి వారికి పంచామృతాలతో విశేష అభిషేకం, అర్చన నిర్వహించామని చెప్పారు. హయగ్రీవ జయంతిని పురస్కరించుకుని హయగ్రీవ హోమం, పూర్ణాహుతి, స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, ఆశీర్వచనంతో కార్యక్రమాలు వైభవంగా జరిగాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భూ వరాహ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పురాణం వెంకటాచార్యులు, శకుంతల దంపతులు పద్మావతి అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, వస్త్రాలు పండ్లతో సారెను అందజేశారు.

వైభవంగా వీర్ల అంకాలమ్మ బోనాల ఉత్సవం



కారెంపూడి: పల్నాటి రణ క్షేత్రంలో అంకాలమ్మ బోనాల ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్ద కాపులు బొమ్మిన శ్రీనివాసరావు, బొమ్మిన కొండలరావు(కొండ) కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతాన్ని అమ్మవారి సన్నిధిలో నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, విశ్రాంత డీటీ యడ్ల రామకృష్ణారావు, వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్య, మాజీ మునసబు పలిశెట్టి కోటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ పెద్దలు ఇతర గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘ఉపాధి’లో మేత.. రికవరీలో కోత!

- సోషల్ ఆడిట్‌తో వెలుగులోకి భారీగా అక్రమాలు
- చేసినట్లు చెబుతున్న పనుల్లో 50 శాతం అవినీతి
- తనిఖీల్లో వెల్లడైనా చర్యలకు డ్వామా పీడీ మీనమేషాలు
- రూ.లక్షల్లో ముడుపులు తీసుకొని నామమాత్రపు రికవరీలు
- అద్దంకి మండలంలో రూ. 8.52 కోట్ల మేరకు పనులు
- రూ. 82 లక్షలు అక్రమాలు జరిగాయని ఆడిట్‌లో వెల్లడి
- రూ.1.69 లక్షలు మాత్రమే రికవరీ చేస్తే చాలన్న పీడీ
- ‘రీ సోషల్ ఆడిట్’ డిమాండ్‌తో కమిషనరేట్‌కు ఫిర్యాదులు

కూటమి ఏడాది పాలనలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది. ఎక్కడ సామాజిక తనిఖీ జరిగినా అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగులోకి వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మొదలు టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలతోపాటు జిల్లా స్థాయిలో పీడీ వరకు అవినీతి సొమ్ములో వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సామాజిక తనిఖీల్లో అక్రమాలు వెలుగుచూస్తున్నా రికవరీ నామమాత్రంగా చేస్తున్నారు.



ఉపాధి హామీ పనులపై జూన్ 20న అద్దంకి ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: నకిలీ మస్టర్, పనులు చేయకుండా చేసినట్లు చూపడం, గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు పెట్టుకోవడం వంటి అక్రమాలతో ఉపాధి హామీలో రూ.కోట్ల ప్రజాధనాన్ని అధికారులు, సిబ్బంది దోచుకుంటున్నారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూసినా.. డ్వామా అధికారి రూ. లక్షల్లో ముడుపులు పుచ్చుకొని ప్రొసీడింగ్ ఆఫీసర్ హోదాలో రెక్టిఫికేషన్, రిఫర్డ్, డ్రాప్డ్ పేరుతో అక్రమాలను కప్పిపుచ్చుతున్నట్లు ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

అద్దంకి పరిధిలో ఎక్కువ

ఉపాధి హామీ పనుల్లో అద్దంకి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో జూన్‌లో జరిగిన సామాజిక తనిఖీల్లో ఈ విషయం తేటతెల్లమైంది. 26 గ్రామ పంచాయతీల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.8,52,33,219 విలువైన పనులు జరిగాయి. ఈ ఏడాది జూన్ 20వ తేదీన అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో వీటిపై సామాజిక తనిఖీ జరిగింది.

అడ్డగోలుగా రికవరీ తగ్గింపు

336 పనులకు సంబంధించి రూ. 82,74,327 మేర పనుల్లో తేడాలున్నాయని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలతో కూడిన సామాజిక తనిఖీలో గుర్తించారు. భారీ మొత్తంలో అవినీతి జరిగిందని కమిటీ తేల్చింది. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవో సహా అందరి సమక్షం లోనే ఈ తనిఖీలు జరుగుతాయని తెలిసిన విషయమే. కానీ 124 పనులకు సంబంధించి రూ. 29,25,256 మాత్రమే డీవియేషన్ ఉందని, ఆ మేరకు మాత్రమే అక్రమాలు జరిగాయని ప్రొసీడింగ్ అధికారి హోదాలో డ్వామా పీడీ తేల్చారు. కేవలం 82 పనులకు చెందిన రూ.1,69,106 మాత్రమే అవినీతి జరిగిందని, ఆ మేరకు డ్వామా పీడీ రికవరీ పెట్టినట్లు సమాచారం. మిగిలిన రూ. 19.34 లక్షలకు సంబంధించిన 9 పనులను రిఫర్డ్ కింద రాసిన పీడీ... రూ. 8,21,426 విలువైన 33 పనులను రెక్టిఫికేషన్‌కు రాశారు. మిగిలిన రూ. 53.49 లక్షలకు సంబంధించి 212 పనుల్లో ఎటువంటి అవినీతి జరగలేదని డ్రాప్డ్ రాశారు. ఈ లెక్కన వాటిల్లో ఎటువంటి అక్రమాలు జరగలేదని డ్వామా పీడీ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. సామాజిక తనిఖీలో రూ. 82.74 లక్షల అవినీతి జరిగిందని తేలితే.. డ్వామా పీడీ మాత్రం కేవలం రూ. 1.69 లక్షలు రికవరీ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. రూ.లక్షల్లో ముడుపులు పుచ్చుకొని అక్రమాలలో కీలక పాత్ర పోషించిన ఏపీవో, సిబ్బందిని కాపాడేందుకే డ్వామా అధికారి రికవరీలు లేకుండా చేశారని డ్వామా వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

రీ ఆడిట్‌కు డిమాండ్

కొన్నిచోట్ల డ్వామా, తనిఖీ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమాలు జరిగాయని తేల్చినా రికవరీలు లేకపోతే ఎలా అని ఉన్నతాధికారులు ఆలోచనలో పడ్డారు. అధికారులపైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అద్దంకి మండలంలో జరిగిన ఉపాధి హామీ అక్రమాలపై రీ సోషల్ ఆడిట్ చేయాలని మండలానికి చెందిన పలువురు నేతలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే కొందరు మాజీ సర్పంచ్‌లు ఈ విషయంపై పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

తూతూమంత్రంగా తనిఖీలు

జిల్లాలో అక్రమాల నేపథ్యంలో ఉపాధి హామీలో సామాజిక తనిఖీలు చేస్తున్న షాట్ అధికారాలపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. అవకతవకలు నివారించేందుకే షాట్ డైరెక్టరేట్ సామాజిక తనిఖీలు నిర్వహిస్తోంది. ఏడాదిపాటు జరిగిన ఉపాధి పనులను షాట్ నుంచి వచ్చే ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగులతో కలిసి తనిఖీలు చేస్తారు. అక్రమాల లెక్కలు తేలుస్తారు. వాటిని రికార్డ్ చేసి ప్రజలు, అధికారుల సమక్షంలో జరిగే సామాజిక తనిఖీల్లో వెల్లడిస్తారు. కానీ అక్రమాలను ప్రొసీడింగ్ ఆఫీసర్ హోదాలో డ్వామా పీడీ కప్పిపుచ్చితే ఇక సామాజిక తనిఖీలకు అర్థం లేదనే స్థితి తలెత్తింది. అద్దంకి మండలంలో జరిగిన తనిఖీలు పరిశీలిస్తే అన్నీ మొక్కుబడిగా మారాయన్న విమర్శలు వచ్చాయి.

గోవాడలో వరలక్ష్మి శ్రీ పార్వతి అమ్మవారికి విశేష పూజలు



అమృతలూరు(భట్టిప్రోలు): శైవ క్షేత్రమైన అమృతలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో వరలక్ష్మి శ్రీ పార్వతి అమ్మవారికి ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం 3వ శుక్రవారం పురస్కరించుకుని దేవాలయంలో కార్యనిర్వాహణాధికారి బి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు స్వర్ణ శ్రీనివాస శర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి వారు, అమ్మ వారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

పందిళ్లపల్లిలో మూడు డెంగీ కేసులు



వేటపాలెం: పందిళ్లపల్లిలో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇద్దరు పెద్దలు, ఒక బాలిక జ్వరంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో గ్రామాన్ని ఆర్‌డీఓ చంద్రశేఖర్ నాయుడు, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. కేసులు నమోదైన వీధుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. మెడికల్ క్యాంపులు, ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ రాజేష్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, డాక్టర్ జైకుమార్, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలిక విక్రయం

- కేసు ఛేదించిన పోలీసులు
- తండ్రితో పాటు మరో ఇద్దరు నిందితులూ అరెస్టు



బాలిక కిడ్నాప్ కేసు వివరాలను వెల్లడిస్తున్న జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ, పక్కన ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి.. భార్యకు తెలియకుండా మూడేళ్ల కుమార్తెను అపహరించాడు. సహజీవనం చేస్తున్న ఓ జంటకు విక్రయించాడు. తర్వాత ఏం తెలియనట్లుగా విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చివరకు అసలు నిందితుడు తండ్రే అని పోలీసులు నిగ్గు తేల్చారు. ఈ మేరకు విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్‌లు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన సైకం మస్తాన్, వెంకటేశ్వరమ్మ భార్యాభర్తలు. వీరికి ఏడుగురు సంతానం. చెడు వ్యసనాలకు బానిసైన భర్త తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. కుటుంబంలో గొడవలు జరగటంతో భార్య తన పిల్లలతో కలసి, భర్తకు దూరంగా వేటపాలెంలో ఉంటోంది. ఈ నెల 6న మస్తాన్ భార్య ఇంటికి వెళ్లి తన ఏడో సంతానమైన మూడేళ్ల శ్రావణిని తీసుకుని విజయవాడలో విక్రయించాడు.

ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన జీఆర్పీ

మస్తాన్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తల్లి ఆచూకీ తెలుసుకుని ఆమెను పిలిపించారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులు బాలికను తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. బస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా విజయవాడ నుంచి రాజమండ్రి వెళ్లే బస్సు ఎక్కినట్లు గుర్తించి డ్రైవర్ నంబర్ తెలుసుకుని ఫోన్ చేసి వివరాలు చెప్పడంతో బాలికను తీసుకుని ఒక మహిళ, పురుషుడు బస్సులో ప్రయాణిస్తున్నట్లు తెలుసుకున్నారు. రాజమండ్రి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని బాలికతోపాటు ఇద్దరు నిందితులను విజయవాడ తీసుకువచ్చారు. బాలికను తల్లికి అప్పగించారు. మస్తాన్‌తోపాటు బాలికను కొనుగోలు చేసిన నిందితులను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భిక్షాటన చేయించేందుకు చిన్నారి కొనుగోలు



తల్లి చెంతకు చేరిన చిన్నారి

విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై మజ్జిగ ప్యాకెట్‌లు విక్రయిస్తున్న ప్రకాశం జిల్లా వేమవరానికి చెందిన బొల్లా శ్రీనివాసులు, స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేసుకుంటున్న సడేల చిన్నారి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ నెల 7న వారిని సైకం మస్తాన్ పరిచయం చేసుకుని తన బిడ్డను విక్రయిస్తానని తెలపడంతో ఆ చిన్నారితో భిక్షాటన చేయిస్తూ ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచించారు. రూ.5 వేలు ఇచ్చి చిన్నారిని కొనుగోలు చేశారు. విజయవాడలోనే ఉంటే బాలిక ఆచూకీ తెలిసిపోతుందని భావించి రాజమండ్రిలో భిక్షాటన చేయించడానికి తీసుకువెళ్లారు. ఇదిలా ఉంటే ఎక్కడ తనపై అనుమానం వస్తుందోనని బాలిక తండ్రి మస్తాన్ ఏం తెలియనట్లుగా అదే రోజు రాత్రి 10.30 గంటలకు తన బిడ్డను ఎవరో కిడ్నాప్ చేశారని ఒకసారి, రిజర్వేషన్ కౌంటర్ వద్ద తప్పిపోయిందని మరోసారి పొంతన లేకుండా జీఆర్పీ పోలీసులకు తెలిపాడు.

ప్రేమానురాగాలకు ప్రతీక

- నేడు రాఖీ పౌర్ణమి
- మార్కెట్‌లో పలు రకాల రాఖీలు



బాపట్లఅర్బన్: ఏటా శ్రావణ పౌర్ణమి వచ్చిందంటే సోదర సోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు నెలకొంటాయి. అన్నాచెల్లెలు... అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ రానే వచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లో వివిధ రకాల రాఖీల విక్రయానికి కొలువుదీరాయి. వెలకట్టలేని బంధాలను గుర్తుచేసే మధుర బంధమే రక్షాబంధన్. తనకు రక్షణగా ఉండాలని ఉద్దేశంతో సోదరులకు శ్రావణ పౌర్ణమి రోజున సోదరి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటుంది. అన్నదమ్ముల యశస్సు, శ్రేయస్సు కోరి రాఖీ కట్టే సంప్రదాయం అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. కొన్ని పాఠశాలలు, కళాశాలలో ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఆడపడుచులను తమ ఇంటి మహాలక్ష్మిగా, పరాశక్తి ప్రతీకగా భావించే గొప్ప సంస్కృతి మనది.

మార్కెట్లలో సందడి

రక్షాబంధన్ వేడుకలకు అందరూ సిద్ధమయ్యారు. రాఖీలు వివిధ ఆకృతులలో దర్శనమిస్తున్నాయి. విరివిరిగా విక్రయ స్టాల్స్ వెలిశాయి. మార్కెట్లు కళకళలాడాయి. గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి స్థానిక వ్యాపారులు వివిధ రకాల రాఖీలు తెచ్చారు. రంగు పూసలతో కూడిన చేనేత కళాకారులు రూపొందించిన రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. జ్యువెలరీ షాపుల్లో వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే గిఫ్ట్ షాపులు, స్వీట్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ఓ దుకాణం వద్ద రాఖీల కొనుగోలు

డెంగీ నివారణకు చర్యలు

- ప్రతి గ్రామంలో ఫాగింగ్ తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని ప్రజలకు సూచన
- అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జిల్లాలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. జిల్లాలో 18 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఫాగింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, వారంలో ఒక రోజు ‘డ్రై డే’గా పాటించి నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఫీవర్ సర్వేలు నిరంతరంగా కొనసాగించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకుల్లో గంబూషియా చేపలు వదలడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఫ్లూయిడ్లు, మంచాలు ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. పీహెచ్‌లు ప్రాథమిక చికిత్సకే పరిమితమవ్వాలని హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్య బాధ్యత వార్డెన్లపై ఉందని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది ప్రతి డెంగీ కేసును కచ్చితంగా నివేదించాలని, సమయానికి సమాచారం అందితే మెరుగైన చికిత్స అందించగలమన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, ఎస్ఈ అన్నంతరాజు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 1,900

క్లుప్తంగా

యువ ఆంధ్ర కబడ్డీ రిఫరీగా శ్రావణి



వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని జరుబుల శ్రావణి యువ ఆంధ్ర కబడ్డీ సిటిజన్–1కి రిఫరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీలో 30 నేషనల్స్ ఆడి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను శ్రావణి నిలబెట్టారన్నారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. హెచ్ఎం దేవరకొండ సరోజిని, పీడీని అభినందించారు.

ఆదాయపు పన్ను చట్టానికి లోబడి వ్యవహరించండి

నరసరావుపేట టౌన్: ఆదాయపు పన్ను చట్టానికి లోబడి వ్యాపారులు వ్యవహరించాలని గుంటూరు ఆదాయపు పన్ను శాఖ అధికారి బి.ఎ. ప్రసాద్ బాబు అన్నారు. నరసరావుపేట విజయ కళ్యాణ మండపంలో శుక్రవారం బంగారు, వజ్రాల వ్యాపారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థలు ఆదాయపు పన్ను ఎంట్రీలు ఫాం 60, ఫాం 61లు నింపే విధానాన్ని వివరించారు. వ్యాపారులు అడిగిన పలు ప్రశ్నలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చేశారు. ఆదాయపు పన్ను నియమాలను వివరించారు. ఐటీ రూల్స్ ప్రకారం వ్యాపారులు నడుచుకోవాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆదాయపు పన్ను అధికారి రామశాస్త్రి, ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గొడవర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనులు కాయలు కాచే..!

ఆర్డీ కోసం ఎదురు చూపులు

- వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ పోస్టు ఖాళీ
- ఆర్డీని ప్రభుత్వానికి సరెండర్ చేసిన అధికారులు
- కొత్త ఆర్డీని నియమించకపోవడంతో ఇబ్బందులు
- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వైద్య ఉద్యోగుల నిరీక్షణ



గుంటూరులో ఆర్డీ కార్యాలయం

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో మూడు జిల్లాల ఉద్యోగులకు కీలకమైన అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో ఫోకల్ జోన్‌గా ఉన్న గుంటూరు కార్యాలయం చుట్టూ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు, సెలవులు మంజూరు, ఇతర ఉద్యోగ కార్యకలాపాల బాధ్యతలన్నీ గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) పర్యవేక్షిస్తారు. ఆర్డీ సంతకం లేకుండా ఉమ్మడి మూడు జిల్లాల ఉద్యోగుల ఫైల్స్ ఒక అంగుళం కూడా ముందుకు వెళ్లవు. అలాంటి కీలక రీజనల్ డైరెక్టర్‌ను గతనెల ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ స్థానంలో నూతనంగా ఎవరిని నియమించలేదు. కనీసం ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించలేదు. దీంతో ఎవరు వస్తారు, ఎప్పుడు వస్తారనే విషయం తెలియక మూడు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొంత మంది ప్రమోషన్లు, మరికొంత మంది సెలవు మంజూరు జాప్యం అవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరచుగా సెలవులు... ఫైల్స్ పెండింగ్

గుంటూరు ఆర్డీగా డాక్టర్ కె.సుచిత్ర గత ఏడాది ఆగస్టులో బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి అనారోగ్య కారణంతో తరచూ సెలవులు పెట్టేవారు. నెలల తరబడి సెలవులు పెట్టడం, ఒక్కోసారి కార్యాలయానికి వచ్చినప్పటికీ అనారోగ్య కారణంతో ఫైల్స్‌పై సంతకాలు పెట్టకుండా కూర్చుండిపోవడం వల్ల మూడు జిల్లాలకు చెందిన ఉద్యోగులు తమ ఫైల్స్ పెండింగ్ ఉంటున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఫైల్స్‌కు సంబంధించి కూడా సంతకాలు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్డీ కార్యాలయం ఉద్యోగులు, అధికారులు, అందరూ మూకుమ్మడిగా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆర్డీని మార్చాలని లిఖిత పూర్వకంగా కోరారు. తరచూ తమపై దాడి చేసిందంటూ ఉద్యోగులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆర్డీ కూడా తనకు కార్యాలయంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, ఉద్యోగులు తనపై దాడి చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. గత నెలలో రెండు వారాల పాటు సెలవు పెట్టిన ఆర్డీని రాష్ట్ర ఉన్నతాధికారులు సరెండర్ చేశారు. దీంతో ఈ నెల 1 నుంచి ఆర్డీ కార్యాలయంలో ఫైల్స్‌పై సంతకాల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

2,500 మందికి పైగా ఉద్యోగులు

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆర్డీ కార్యాలయం పరిధిలో 2,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. స్టాఫ్ నర్సులు, హెడ్‌నర్సులు, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఈఓలు, సీహెచ్ఓలు, రేడియోగ్రాఫర్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, ఇలా పలు కేడర్లకు చెందిన పారా మెడికల్, మినిస్టీరియల్ ఉద్యోగులు ఆర్డీ కార్యాలయం పరిధిలో ఉన్నారు. వీరిలో 25 కేడర్లకు చెందిన ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. పలువురు ఉద్యోగులకు వ్యక్తిగత, మెడికల్ సెలవులు, ఇంక్రిమెంట్లు, ఇతర అలవెన్సులకు సంబంధించిన ఫైల్స్ వందకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు ఫైల్స్‌ది అదే పరిస్థితి.

ఇన్‌చార్జి నియామకంపై జాప్యం

గతంలో రెగ్యులర్ ఆర్డీ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినా, పదవీ విరమణ చేసినా, బదిలీ అయినా, మరో రెగ్యులర్ ఆర్డీ విధుల్లో చేరే వరకు తాత్కాలికంగా వేరొకరిని నియమించేవారు.. తాత్కాలిక, ఆర్డీని ఎఫ్ఏసీ హోదాలో నియమించేందుకు ఏమైనా ఆటంకాలు ఏర్పడితే ఆర్డీ పోస్టు ఖాళీగా ఉండకుండా, కనీసం గుంటూరు డీఎంహెచ్ఓను ఇన్‌చార్జి ఆర్డీగా నియమించి, ఆర్డీ కార్యాలయం కార్యకలాపాలు సజావుగా జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేవారు. నేడు వీటిల్లో ఏ ఒక్కటి జరగకపోవడం, కనీసం ఆర్డీ కార్యాలయానికి అధికారిని కూడా నియమించకపోవడంతో ఉద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఇన్‌చార్జి ఆర్డీని నియమించి ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వేటపాలెం విద్యార్థులు

వేటపాలెం: రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని శుక్రవారం తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం బాపట్లలో రాష్ట్ర స్థాయి ఎంపికలు జరిగాయి. వీటిలో కె.గాయిత్రి, పి.బిందు వాలీ బాల్, షేక్ నస్రీన్, ఎల్.వైష్ణవి కబడ్డీకి ఎంపికయ్యారని తెలిపారు. గుటూరులో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయిని జడ దేవభిక్షం, జరుబు శ్రావణి, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులు

వ్యాయామ ఉపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం నంబూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.మస్తాన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో పని చేస్తున్న సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సామగ్రి, నిధులను స్వాహా చేశారనే ఆరోపణలపై మస్తాన్‌రెడ్డిపై ఉప విద్యాశాఖాధికారితో విచారణ జరిపించారు. తాజాగా డీవైఈవో సమర్పించిన నివేదిక ఆధారంగా ఆరోపణలు రుజుం కావడంతో ప్రస్తుతం నంబూరు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పి. మస్తాన్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈవో రేణుక తెలిపారు.

తపాలా శాఖలో కమీషన్ ఏజెంట్ల నియామకాలు

నరసరావుపేటటౌన్: నరసరావుపేట పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలు కమీషన్ బేసిస్ ఏజెంట్‌లుగా పనిచేసేందుకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాదిక్ శుక్రవారం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. ఈనెల 20వ తేదీ డివిజనల్ పోస్టల్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94946 42465 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్విట్ కార్పొరేట్ పేరుతో నిరసన

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): ఆ నాడు బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టడం జరిగిందని, నేడు వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పటాన్ని వ్యతిరేకిస్తూ 'క్విట్ కార్పొరేట్–క్విట్ మోదీ' అనే నినాదంతో ఈనెల13 తేదీన గుంటూరులోని లాడ్జి సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరుగుతుందని రైతు సంఘ జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ విశ్రాంత శాస్త్రవేత్త వేణుగోపాలరావు వెల్లడించారు. గుంటూరు బ్రాడీపేటలోని పీఎల్ రావు భవన్‌లో శుక్రవారం అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల సమావేశం పాటిబండ్ల కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగానికి నష్టం చేసే మార్కెట్ చట్టం రద్దు చేయించాలని, అందుకు రైతాంగాన్ని కదిలించాలని పిలుపునిచ్చారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు లాడ్జి సెంటర్లో నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు మన్నవ హరిప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.హనుమంతరావు, ఏ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అన్నాచెల్లెలకు తీవ్రగాయాలు

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నా చెల్లెలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల తండ్రి శ్రీనివాసులు రెడ్డి అందించిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా తాళ్ళూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన పాలం శ్రీనివాసరెడ్డి కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి కాటూరి మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె చందు సహజా రెడ్డి విజయవాడలో ఇంటర్ చదువుతోంది. చెల్లెలితో కలిసి పవన్ కుమార్ రెడ్డి గురువారం రాత్రి బైక్‌పై స్వగ్రామం వెళుతున్నాడు. స్థానిక జాతీయ రహదారిపై డేగరమూడి సమీపంలో సర్వీసు రోడ్డు నుంచి రహదారిపైకి వెళుతున్న వీరి బైక్‌ను మార్టూరుకు చెందిన ఓ గ్రానైట్ వ్యాపారి తన కారుతో వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి అనంతరం డివైడర్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో చేతులు, కాళ్ళు విరిగిన అన్నా చెల్లెలను హైవే సిబ్బంది గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పవన్ కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాసిడ్ లోడ్‌తో వెళ్తున్న ట్రక్ ఆటో బోల్తా

మహిళ దుర్మరణం



ఘటనాస్థలంలో యాసిడ్‌ను శుభ్రం చేస్తున్న ఫైర్ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ బైపాస్‌రోడ్డులో యాసిడ్ లోడుతో వెళ్తున్న ట్రక్ ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందింది. గుంటూరుకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ అల్లాభక్షు శుక్రవారం యాసిడ్ లోడుతో ఏలూరు బయలుదేరాడు. తోడుగా ఉంటుందని తన భార్య షేక్ షంషాద్ (47)ను వెంట తీసుకెళ్లాడు. హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డు వద్దకు రాగానే ట్రక్కు ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఉన్న షంషాద్ రోడ్డుపైకి పడిపోయింది. ట్రక్కులో ఉన్న యాసిడ్ డ్రమ్ములు కిందకు ఒరిగి షంషాద్‌పై యాసిడ్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. అల్లాభక్షు కంటిలో యాసిడ్ పడటంతో పాటుగా శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. రహదారిపై యాసిడ్ పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ వి.అమరేశ్వరరావు సిబ్బందితో రహదారిపై పడిన యాసిడ్‌ను శుభ్రం చేయించారు. క్రేన్ సాయంతో ట్రక్కు ఆటోను రహదారిపై నుంచి పక్కకు తొలగించారు. ఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోడ్రైవర్ షేక్ అల్లాభక్షును చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. షంషాద్ మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

బ్యాంకుల్లో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: బ్యాంకులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల భద్రతా ప్రమాణాలపై జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం బ్యాంకు మేనేజర్లు, సెక్యూరిటీ అధికారులతో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీసీ టీవీ కెమెరాల వినియోగం, సెక్యూరిటీ గార్డుల పనితీరు, అలారం సిస్టమ్స్, డబుల్ లాక్ విధానం వంటి సాంకేతిక చర్యలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచనలు చేశారు. బ్యాంక్ ప్రాంగణంలో రాత్రి సమయాల్లో లైటింగ్ సౌకర్యం, సెక్యూరిటీ గార్డుల పహారా, నగదు రవాణా సమయంలో జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుకంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, ప్రజల భద్రత కోసం బ్యాంకు, పోలీసుల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగాలని తెలిపారు. అలాగే జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలపై చర్చించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ కాల్స్, కృత్రిమ వెబ్‌సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. బ్యాంక్ ఖాతాదారుల డేటా భద్రత, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 1930 గురించి సోషల్ మీడియాలో ప్రచారం కల్పించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమానికి 83 ఏళ్లు

చీరాల రూరల్ : క్విట్ ఇండియా ఉద్యమానికి శుక్రవారంతో 83 ఏళ్లు పూర్తయ్యాయని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యోద్యమ సన్నాహక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఊరూరా జనవిజ్ఞానం ఆధ్వర్యంలో స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాజ్యాంగంలో పొందుపరచిన దేశభక్తి, ప్రజాస్వామ్యం, సామాజిక స్పృహ, లౌకిక భావాలు, సమసమాజ నిర్మాణం, శాస్త్రీయ ఆలోచన, గణతంత్ర రాజ్యం, సామాజిక న్యాయం, సామాజిక సంస్కరణలు వంటి వాటిని ప్రస్తుత సమాజంలో కచ్చితంగా అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో గాదె హరిహరరావు, సుందరరామయ్య, రామారావు, కోటేశ్వరరావు, అప్పన్నరెడ్డి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

పంట పొలాల్లో ఇష్టానుసారం తవ్వకాలు

నగరం: కూటమి నాయకులు యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేసినా లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకులు మట్టి మాఫియాగా మారి పచ్చని పంట పొలాలను లోతైన గుంతలుగా మారుస్తున్నారు. సిరులు పండే పంట పొలాలు తవ్వకాలతో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ శాఖ మంత్రి అండ దండలతో ...

మండలంలోని పెదమట్లపూడి, చినమట్లపూడి, శిరిపూడి కమ్మవారిపాలెం, పూడివాడ గ్రామాలలో కూటమి నేతలు జోరుగా మట్టి వ్యాపారం చేస్తున్నారు. పెద్ద టిప్పర్లతో మట్టిని దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట పొలాల్లో సుమారు 20 నుంచి 30 అడుగుల మేర మట్టి తవ్వకాలు చేస్తుండటంతో పక్కన ఉన్న పొలాలు ఎందుకు పనికిరావని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలతో మట్టి మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోతుందనే విమర్శలు తలెత్తుతున్నాయి. అందుకే అధికారులు మట్టి మాఫియాపై చర్యలు తీసుకోలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



మట్టి తరలిస్తున్న భారీ టిప్పర్లు